

# పుస్తక పరిచయం




**తెలుగు కథాసాహిత్యంలో** ఈ 'ఆనాటి వాన చినుకులు' కథాకదంబం ఒక విశిష్టమైన, వినూత్నమైన, అద్భుతమైన ప్రయోగం. గుండెలోతుల్ని, మనసారా తడిమే విజయవంతమైన ప్రయోగం. ఒకే శీర్షిక.. కథలెన్నో! ఈ ప్రయోగానికి బీజం వేసిందీ, రచయితలను ప్రోత్సహించి కథలు వ్రాయించిందీ శ్రీ వేమూరి సత్యనారాయణగారు. గత అర్థ శతాబ్దంగా పత్రికా, సినిమా రంగాల్లో విశేషమైన కృషిచేసిన సాహితీపిపాసి సత్యనారాయణగారు. స్వతహాగా రచయిత ఐనా ఇతర రచయితలను ప్రోత్సహించడంలో ముందుంటారు. ఇది గత నాలుగైదు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రక్రియే. ప్రస్తుతం మనముందున్న కథాసంకలనం వెనుకనున్న కథ చాలా ఆసక్తిగా ఉంది. ఎక్కడో, ఎప్పుడో సత్యనారాయణగారు ఓ రిక్షా చూశారు. రిక్షా వెనకాల రకరకాల వాక్యాలు వ్రాయడం ఒక ఆనవాయితీ 'సర్వే జనాఃసుఖినో భవంతు' , 'సత్యమేవ జయతే' 'నన్ను చూసి నవ్వకండి' ఇలా. ఒక్కోసారి ఆయా పెయింటర్ల సృజనాత్మకత కూడా ప్రత్యేకంగా ఉంటుంది. అలా సత్యనారాయణగారు ఒక రిక్షా వెనుకాల చూసిన వాక్యమే 'ఆాటి వాన చినుకులు' ఎంత భావుకత, ఎంత ఆర్ద్రత..! ఆ వాక్యం చదివాక సత్యనారాయణగారు వివిధ రచయితలకూ చెప్పి ఆ వాక్యమే శీర్షికగా కథలు వ్రాయించారు. కొన్ని సంవత్సరాలుగా సాగిన ఈ ప్రయత్నాల తుది రూపమే ఈ సంకలనం. ఈ సంకలనంలో సత్యనారాయణగారితో బాటు దర్శకులు వంశీ, వసుంధర, పెద్దింటి అశోక్ కుమార్, కుప్పిలి పద్మ, గొర్తి సాయిబ్రహ్మానందం, ..లాంటి చేయితిరిగిన కథారచయితలు 24 మంది తమ కథలను అందించారు. సహజంగానే 'ఆనాటి వాన చినుకులు' అనగానే మధురమైనవో, బాధాకరమైనవో, జ్ఞాపకాలే మనసుని పలకరిస్తాయి. ఇందులోని కథలన్నీ కూడా అలాంటివే. సత్యనారాయణగారి మాటల్లోనే చెప్పాలంటే ' ఇందులోని కథలన్నీ జ్ఞాపక ప్రధానాలు. యివి జ్ఞాపకాల మూటలు, జ్ఞాపకాల విరులు, జ్ఞాపకాల మాలలు, జ్ఞాపకాల సంతోషాలు, జ్ఞాపకాల విషాదాలు, జ్ఞాపకాల వినోదాలు, జ్ఞాపకాల విన్యాసాలు..'. ఒక్కో కథా చదువుతుంటే పై వాక్యాలు నూటికి నూరుశాతం నిజమేనని తెలుస్తుంది. మొట్టమొదటి కథలోనే వంశీగారు పాఠకుల్ని ఒక లోకంలోకి తీసుకెళ్ళి వదులుతారు. మిగతారచయితలంతా కూడా పాఠకులకు అదే లోకంలోని ( జ్ఞాపకాల ప్రపంచంలో) వివిధ కోణాలను చూపిస్తారు. ఒక్కో కథా చదువుతుంటే మనసంతా జ్ఞాపకాల జల్లుల్లో తడుస్తుంది. చాలాచోట్ల మనకి మనం కనిపించడమో, లేదా మనం అక్కడకు వెళ్ళి యా పాత్రలమధ్య తిరుగాడడమో జరుగుతుంది. పుస్తకం పూర్తయేసరికి ఇంకా మనకా ప్రపంచంనుంచీ బయటకు రాబుద్ధికాదు సరికదా మనజీవితంలోని 'ఆనాటి వాన చినుకులు' మనల్ని తడిపి ముద్దచేస్తూనే ఉంటాయి. కథాప్రియులు తప్పక చదవాల్సిన పుస్తకం. ఇంత అద్భుతమైన ప్రయోగానికి సంధానకర్త ఐన వేమూరి సత్యనారాయణగారు అభినందనీయులు.

***

**Published by**
Vemuri Books,
506, Sri Sairam Towers,
J.P.Nagar,
Yellareddyguda,
Hyderabad-500 073.
040-23751610




**బండారి రాజ్‌కుమార్** ఆధునిక కవితాప్రపంచంలో కొత్త అడుగు, కొత్తగొంతు, కొత్తస్వరం, కొత్త సంతకం..! కవితా కౌముది అభిమానులకు రాజ్‌కుమార్‌గారి పేరు సుపరిచితమే. ఈ కవి ప్రచురించిన నాలుగవ కవితాసంపుటి ఈ 'వెలుతురు గబ్బిలం'. దాదాపు 50 కవితలున్న ఈ సంపుటిలోని ప్రతికవితా ఆలోచింపదగినదీ, ఆస్వాదించదగినదీ. కవితా శీర్షిక మొదలుపెట్టడం నుంచి కవితలోని ప్రతి పంక్తిలోనూ, ప్రతి పదంలోనూ, ప్రతి భావవ్యక్తీకరణలోనూ కవి యొక్క గాఢమైన ఆలోచనా సరళి ప్రతిబింబిస్తుంది. మనోభావాలు, సంఘటనలూ, దృశ్యాలూ..అన్నీ కవితావస్తువులే ఇందులో.

"వేడికి పుట్టిన మంచుగడ్డలు / సెక తాకంగనే కరుగుడు / ఎంతైచ్ఛంత్రమో కద! / తుడిపేసుకున్న యాదులు కొన్ని / శిలువేసుకున్న మనసు శిలక్కొయ్యకు యాళ్ళాడుతుంటే / గుండెలోపలికి చెయ్యిపెట్టి / ఎంతదేవినా... అంతా శూన్యమే కనపడుతది." రాజ్‌కుమార్ గారిది అతిబలమైన భావవ్యక్తీకరణ. ఆలోచనా సాగరాన్ని మథించగా,మథించగా వచ్చిన కవితామృతమే ఈ కవితలనిండా.. "సలసల మరిగిన రక్తం సప్పుడు వినలేనితనం / చేతివేళ్ళను ఒక్కటిచేసే పిడికిలై / పిడిగుద్దులు విసరలేనితనం / నిర్వీర్యమైన వీర్యంతో నా దేశం / ఎంతమంది దేశభక్తుల్ని కంటుందో వేచిచూద్దాం.." ఏ విషయం చెప్పడంలోనైనా సౌకుమార్యం, లాలిత్యం కంటే సూటిదనం, ఘాటుదనం పుష్కలంగా నింపుకున్న కవితలివన్నీ.. శైలి కవికి సొంతమైనదే . భాష విషయంలో కూడా కొత్తకొత్త ప్రయోగాలుగా అనిపిస్తాయి కొన్ని కవితలు చదువుతుంటే. వాక్యంలో కొంతభాగం మామూలుగానూ, మరికొంత భాగం తెలంగాణా మాండలీకంలోనూ అగుపిస్తాయి - "వేదాంతపు కథలల్లుకుంట కాలంజేత్తరు" , "ఇక్కడొక వనం / అనాథలా పెరుగుతది" , " బతుకంతా తపోనిద్రలో జీవిస్తూనే వున్నం", " నిద్రా భంగమో , తపో భంగమో, జీవిడిసేలోపే ఏదో ఒకటి జరగాల్సిందే". బహుశా ఇలా రెండురకాల భాషా రూపాల్ని కలిపివ్రాయడం కూడా ఒక కొత్త విధానం కావొచ్చు. కొన్ని వాక్యాలు గుండెల్ని మెలితిప్పుతాయి. చదివిన చాలాసేపు మనసుని వదిలిపెట్టవు - "రేపటి మొలకల పున్నానికని / నాలుగిత్తులు దాపెట్టుకుంటే / నా మట్టిపేగునెవరో కత్తిరించుకు పోయిను". కవితాసంపుటి చదువుతున్నంత సేపూ ఒక కొత్త ప్రపంచంలో విహరిస్తున్నట్లుంటుంది. కవితా సంపుటికి ముందు వెనుక ఉన్న పరిచయాలు, విశ్లేషణలూ ( చార్య కోవెల సుప్రసన్నాచార్య / శిఖామణి / శిలాలోలిత / పరచా వెంకటేశ్వర్లు ) కూడా చాలా సమగ్రంగా ఉన్నాయి. భావగర్భితమైన ఇంత మంచికవితలను అందించిన కవి బండారి రాజ్‌కుమార్ అభినందనీయులు . ***

**_Writer:_**

Bandari Rajkumar
Bandarirajkumar02@gmail.com
Phone: 99599 14956

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**